సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 20 । అక్టోబర్ । 2023



నగదు లావాదేవీలపై దృష్టి..

ఎన్నికల కోడ్ ఉన్న దృష్ట్యా బ్యాంకుల్లో రూ. 10 లక్షల పైన లావాదేవీలపై దృష్టి పెట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

- IIలో ▸



'అండర్‌గ్రౌండ్' రాజకీయం

నగరంలో 14 ఏళ్లుగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు సాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం ఈ అంశం రాజకీయంగా మారింది.

- IVలో ▸

గరిష్టం/కనిష్టం

34.9 /22.5

వాతావరణం

ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం చలిగాలులు వీస్తాయి. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

బతుకమ్మ సంబురాల్లో స్పీకర్ పోచారం



రుద్రూర్ : రుద్రూర్ మండల కేంద్రంలో గురువారం జరుపుకున్న బతుకమ్మ పండుగ సంబరాలకు స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. అంగడిబజార్‌లోని లక్ష్మీ గణపతి ఆలయం వద్ద గురువారం రాత్రి బతుకమ్మలకు పూజలు చేశారు. చిన్నారులు, మహిళలతో కల్సి కోలాటాలు ఆడారు. ఎంపీపీ సుజాత నాగేందర్, మాజీ సర్పంచ్ వసంత సంజీవరెడ్డి తదితరులున్నారు.

వైఎస్సార్‌టీపీ అర్బన్ టికెట్‌కు భిక్షపతి దరఖాస్తు



సుభాష్‌నగర్ : వైఎస్సార్ తెలంగాణ పార్టీ నిజామాబాద్ అర్బన్ అభ్యర్థిగా తనకు అవకాశమివ్వాలని కోరుతూ సీనియర్ నాయకులు, వైఎస్సార్ అభిమాని నూరి భిక్షపతి దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు పత్రాన్ని హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో ఉన్న పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అందజేశారు. అనంతరం వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను మర్యాదపూర్వకంగా కలిశారు. అర్బన్ అభ్యర్థిగా తనకు అవకాశమివ్వాలని విన్నవించగా, దీనికి స్పందిస్తూ త్వరలో అభ్యర్థులను ప్రకటిస్తామని, పార్టీ బలోపేతానికి పనిచేయాలని సూచించారన్నారు.

సునీల్‌రెడ్డి కుటుంబానికి కవిత పరామర్శ



బాల్కొండ : మెండోరా మండలం సావెల్‌లో కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డి కూతురు తొమ్మిది రోజుల క్రితం మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్సీ కవిత, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కవిత కన్నీటి పర్యంతమయ్యారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలన్నారు. బేబీ సమన్వికి నివాళులు అర్పించారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

పోలింగ్ విధులపై అవగాహన ఉండాలి



సుభాష్‌నగర్ : ఎన్నికల ప్రక్రియలో అతి కీలకమైన పోలింగ్ విధులపై సంబంధిత అధికారులకు అవగాహన ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ నిర్వహించగా అందులో ఆయన మాట్లాడారు. మాక్‌పోల్ జరిపిన తర్వాత తప్పనిసరిగా డాటా డిలీట్ చేయాలని, ఈ విషయాన్ని ప్రతి ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారి గుర్తుంచుకోవాలన్నారు. పోలింగ్ ప్రారంభానికి ముందు కంట్రోల్ యూనిట్ డేటా జీరో ఉందా లేదా అన్నది తప్పక పరిశీలించు కోవాలని తెలిపారు. పోలింగ్ తర్వాత పోలైన ఓట్లను సరిచూసుకోవాలన్నారు. 17-ఏ, 17-సీ వివరాలతో కంట్రోల్ యూనిట్ వివరాలు సరిపోవాలన్నారు. పోలింగ్ సజావుగా నిర్వహిస్తే, కౌంటింగ్ సాఫీగా జరిగి ఎన్నికల ప్రక్రియ సక్సెస్ అవుతుందన్నారు. శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్ పి యాదిరెడ్డి, మాస్టర్ ట్రైనర్లు సంజీవ్, గోపాలకృష్ణ, ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.



శ్రీ దుర్గామాత



శ్రీ బాలా త్రిపురసుందరి దేవి



శ్రీ గాయత్రీదేవి



అన్నపూర్ణేశ్వరి దేవి



శ్రీ రాజరాజేశ్వరి దేవి



శ్రీ మహాలక్ష్మి దేవి



శ్రీ మహా సరస్వతి దేవి



శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి



శ్రీ మహిషాసురమర్ధిని దేవి

నవరాత్రులు.. నవరూపాలు

జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. నగరంలోని శ్రీనగర్ కాలనీలోని దుర్గామాత మండపంలో 9వ సారి మాతా ప్రతిష్ఠాపన సందర్భంగా అమ్మవారి 9 అవతారాలతో కూడిన విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ప్రధాన విగ్రహంతో పాటు ఒక్కో అవతారానికి ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు చేస్తున్నారు. ప్రతిరోజూ అన్నదానం చేస్తున్నారు. రాత్రి సమయంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, హరికథా కార్యక్రమాలు చేస్తున్నారు. కార్పొరేటర్ ఆకుల హేమలత శ్రీనివాస్, కాలనీ కమిటీ అధ్యక్షుడు అంకం లక్ష్మణ్, కార్యదర్శి జగదీష్, కోశాధికారి నారాయణ, సభ్యులు మల్లయ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

కామారెడ్డి బరిలో అర్వింద్?

ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సమీపిస్తున్న కొద్దీ రాజకీయ పరిణామాలు గంటగంటకూ మారుతున్నాయి. బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రచారపర్వం కొనసాగిస్తూనే తమకు ప్రత్యర్థులుగా ఎవరొస్తారనే విషయమై ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలో త్రిముఖ పోటీ నెలకొన్న నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీల నుంచి ఎవరికి టికెట్లు వస్తాయోననే టెన్షన్ బీఆర్ఎస్ అభ్యర్థుల్లో పెరుగుతోంది.

- కేసీఆర్‌పై పోటీకి పరిశీలిస్తున్న బీజేపీ నాయకత్వం
- నిజామాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా షబ్బీర్‌అలీ?
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో చర్చ
- కాక రేపుతున్న ఇందూరు రాజకీయం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఇదిలా ఉండగా కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ బరిలో ఉండనున్న నేపథ్యంలో అక్కడి అధికార పార్టీ నాయకుల మధ్య విభేదాలు భగ్గుమంటుండడంతో బుధవారం ప్రగతిభవన్‌లో కేటీఆర్ ఆయా వర్గాలను పిలిచి మాట్లాడారు. మరోవైపు అసమ్మతి సైతం రగులుతోంది. పార్టీ నాయకత్వం తమను పట్టించుకోవడంలేదని ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ బరిలో ఉంటున్నప్పటికీ విజయం కోసం శ్రమించాల్సిన ఆవశ్యకత నెలకొంది. కేసీఆర్ పోటీతో చుట్టుపక్కల నియోజకవర్గాలపై బీఆర్ఎస్‌కు సానుకూల ప్రభావం ఉంటుందని ఆశించినప్పటికీ ఆ పరిస్థితి లేకపోవడంతో పాటు అక్కడి నాయకుల్లో నెలకొన్న అసంతృప్తి, విభేదాలు కలవరం కలిగిస్తున్నాయి.

ముస్లిం మైనారిటీ ఓట్ల కోసం..

నిజామాబాద్ ఎమ్మెల్యే టికెట్‌ను పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ ఆశిస్తున్నారు. అయితే ఈ స్థానంలో 1.20 లక్షల ముస్లిం మైనారిటీ ఓట్లు ఉన్నాయని, ఇక్కడ ముస్లిం మైనారిటీని నిలబెట్టాల్సిందేనని ఢిల్లీ ఏఐసీసీలోని ముస్లిం నేతలు పట్టుబడుతున్నారు. ఈ క్రమంలో తాజాగా షబ్బీర్‌అలీ నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.

నిజామాబాద్ అర్బన్‌కు షబ్బీర్ పేరు అనూహ్యంగా తెరపైకి రావడంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. కాగా ఈ టికెట్టును పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్ సైతం ఆశిస్తుండడం గమనార్హం. ఎప్పటికప్పుడు మారుతున్న పరిణామాలతో రాజకీయ వర్గాల్లో మరింత కాక రేపుతోంది.


కేసీఆర్‌ను ఢీకొనేందుకు..

ఇలాంటి పరిస్థితుల్లో కామారెడ్డి నుంచి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను బరిలో నిలబెట్టాలనే అంశాన్ని బీజేపీ నాయకత్వం పరిశీలిస్తోంది. నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి చేసిన అనేక ప్రజాపోరాటాల నేపథ్యంలో బీజేపీ ఇప్పటికే అక్కడ బలంగా ఉంది. ఈ నేపథ్యంలో కేసీఆర్‌ను ఉక్కిరిబిక్కిరి చేసి సదరు స్థానాన్ని కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో బీజేపీ ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఇప్పటికే బీజేపీ కీలక స్థానాల్లో బీఆర్ఎస్ నాయకులపై బలమైన అభ్యర్థులను నిలబెట్టేందుకు ప్లాన్ చేస్తోంది. ఇందులో భాగంగా గజ్వేల్ నుంచి కేసీఆర్‌పై ఈటల రాజేందర్‌ను, సిరిసిల్ల నుంచి కేటీఆర్‌పై బండి సంజయ్‌ను, కామారెడ్డిలో కేసీఆర్‌పై ధర్మపురి అర్వింద్‌ను పోటీ పెట్టేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ఇప్పటికే ఈటల రాజేందర్ సిట్టింగ్ స్థానం హుజూరాబాద్, ఎంపీ బండి సంజయ్ కరీంగనర్ అసెంబ్లీ, అర్వింద్ కోరుట్ల అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేసే విషయం ఖరారైంది. అయితే బీసీ నేతలైన వీళ్ల ముగ్గురినీ ఇలా కీలకమైన రెండో స్థానంలో బరిలో దించేందుకు పార్టీ నాయకత్వం ఆలోచన చేస్తుండడం మరింత కాక పుట్టిస్తోంది. పార్టీ ఆదేశిస్తే కేసీఆర్‌పై పోటీకి సిద్ధమని అర్వింద్ ఇప్పటికే ప్రకటించడం గమనార్హం.

హవాలా డబ్బు హాంఫట్

దర్జాగా పోలీసుల చేతివాటం

- గంజ్‌లో రూ.16 లక్షలు పట్టుకున్న పోలీసులు
- రూరల్ నియోజకవర్గంలోని సీఐకి రూ. 1.50 లక్షలు
- సమాచారమిచ్చిన వారికి రూ.3లక్షలు
- రూ.3.50 లక్షలు నొక్కేసిన ఎస్‌హెచ్‌వో
- నెలన్నర క్రితం జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి..



ఖలీల్‌వాడి : కంచే చేను మేస్తే అన్నట్లుగా.. వివిధ మార్గాల్లో అక్రమంగా తరలుతున్న డబ్బును పోలీసులు పట్టుకుని సీజ్ చేయాల్సి ఉండగా.. తాము పట్టుకున్న డబ్బులో చేతివాటం ప్రదర్శించి దర్జాగా వాటాలేసుకుని పంచేసుకున్నారు. నెలన్నర క్రితం జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల ఓ మండలానికి చెందిన హవాలా వ్యాపారి జిల్లా కేంద్రంలోని గంజ్ ప్రాంతానికి డబ్బుతో రాగా పోలీసులు పక్కా సమాచారంతో పట్టుకున్నారు. సుమారు రూ. 16లక్షల డబ్బును స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. సదరు హవాలా వ్యాపారిని పోలీసులు విచారించి డబ్బులను ఇన్‌కంటాక్స్ అధికారులకు గాని అప్పజెప్పాలి.. లేదా కేసు నమోదు చేయాలి. కాని ఇక్కడే రూరల్ నియోజకవర్గానికి చెందిన ఓ సీఐ లైన్లోకి వచ్చారు. సీఐ, ఎస్‌హెచ్‌వోతో మాట్లాడి హవాలా వ్యాపారి డబ్బులు ఇన్‌కంటాక్స్ అధికారులకు అప్పగించకుండా, కేసు నమోదు నమోదు కాకుండా చక్రం తిప్పారు. దీంతో సదరు వ్యాపారితో పోలీసులు బేరసారాలు మొదలుపెట్టారు. దీంతో ఎస్‌హెచ్‌వోకు సగం మరో సగం హవాలా వ్యాపారి తీసుకునేందుకు ఒప్పందం కుదరడంతో రూ. 8 లక్షలు ఎస్‌హెచ్‌వో తీసుకోగా, మిగితా రూ. 8లక్షలు హవాలా వ్యాపారికి ఇచ్చేశారు. హవాలా వ్యాపారి పీఎస్ నుంచి వెళ్లిన తర్వాత సీఐతో పాటు సమాచారం ఇచ్చిన వ్యక్తికి డబ్బులు సెటిల్‌మెంట్ చేసినట్లు తెలిసింది. సదరు సమాచారం ఇచ్చిన వ్యక్తికి ఎస్‌హెచ్‌వోకు ఫోన్‌చేసి రూ. 3 లక్షలు తీసుకెళ్లినట్లు సమాచారం. అలాగే హవాలా వ్యాపారి, ఎస్‌హెచ్‌వోకు మధ్యలో మాట్లాడిన నిజామాబాద్ రూరల్ ప్రాంతానికి చెందిన ఓ సీఐ రూ.1.50 లక్షలు తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. హవాలా వ్యాపారిని పట్టుకున్న సదరు ఎస్‌హెచ్‌వో రూ. 3.50 లక్షలు తీసుకొని కేసు లేకుండా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని గంజ్ ప్రాంతానికి హవాలా డబ్బులు జోరుగా వస్తాయనే ప్రచారం ఉంది. పోలీసులు హవాలా డబ్బులను పట్టుకొని ఇప్పటివరకు కేసులు నమోదు చేసిన దాఖలాలు కాని, ఇన్‌కంటాక్స్‌కు అప్పజెప్పిన ఘటనలు కాని లేవు. ఎన్నికల కోడ్ అమలు కావడంతో సామాన్యులు రూ. 50వేలకు పైగా తీసుకెళ్లినా పట్టుకుని డబ్బును ఇన్‌కంటాక్స్ అధికారులు అప్పజెప్తున్నారు.

నేడు జిల్లాకు రాహుల్‌గాంధీ..

- కమ్మర్‌పల్లి వద్ద ఆహ్వానించనున్న కాంగ్రెస్ నేతలు
- మోర్తాడ్, ఆర్మూర్‌లో కార్నర్ మీటింగ్
- నిజామాబాద్, బోధన్ పర్యటన రద్దు



ఖలీల్‌వాడి: జిల్లాలో ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ రాహుల్‌గాంధీ బస్సుయాత్ర కార్నర్ మీటింగ్‌లు శుక్రవారం నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా సరిహద్దు ప్రాంతమైన కమ్మర్‌పల్లి వద్ద విజయభేరి బస్సు యాత్రను కాంగ్రెస్ శ్రేణులు స్వాగతం పలుకుతారని తెలిపారు. కమ్మర్‌పల్లి గ్రామానికి మధ్యాహ్నం 1.30 గంటలకు చేరుకొని బస్సుయాత్ర చేస్తారు. అనంతరం అక్కడి నుంచి మోర్తాడ్ బస్టాండ్ వద్ద మధ్యాహ్నం 2 గంటలకు కార్నర్ మీటింగ్ ఉంటుందన్నారు. అనంతరం మోర్తాడ్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 2.45 గంటలకు పెర్కిట్ హైవే వంతెనను చేరుకొని అక్కడి నుంచి బస్సు యాత్రలో భాగంగా ర్యాలీగా బయలుదేరి మధ్యాహ్నం 3 గంటలకు ఆర్మూర్‌లోని అంబేడ్కర్ చౌరస్తా చేరుకొని కార్నర్ మీటింగ్ నిర్వహిస్తారన్నారు. అనంతరం ఆర్మూర్ నుంచి రాహుల్ గాంధీ హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి బయలుదేరి వెళ్తారు. ఢిల్లీలో జాతీయ కాంగ్రెస్ పార్టీ సమావేశం ఉండటంతో నిజామాబాద్ అర్బన్, బోధన్‌లో నిర్వహించే రాహుల్ గాంధీ పాదయాత్ర, కార్నర్ మీటింగ్, రైతులతో జరిగే సమావేశాలను రద్దు చేశారు. ఆర్మూర్, మోర్తాడ్‌లో కార్నర్ మీటింగ్‌కు యువకులు, రైతులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఏసీబీ వలలో సమాచారశాఖ డీఈఈ

- రూ. 9 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వేణి ప్రసన్న
- జిల్లాలో వారం రోజుల్లోనే రెండు ఏసీబీ దాడులు



మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్

సుభాష్‌నగర్ : జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖలో పనిచేస్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ చెల్లంగి వేణి ప్రసన్న రూ. 9 వేలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా గురువారం ఏసీబీ వలకు చిక్కారు. ఏసీబీ డీఎస్పీ ఏపీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కోనేటి విజయ్‌కుమార్ సమాచార పౌర సంబంధాల శాఖలో తన వాహనాన్ని నెలకు రూ. 33 వేలు చెల్లించేలా అద్దెకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఒప్పందం ప్రకారం మూడు నెలల వాహన అద్దె బిల్లు విజయ్‌కుమార్‌కు రావాల్సి ఉంది. బిల్లులు మంజూరు చేయడానికి, ఎస్‌టీవోకు ఫార్వర్డ్ చేసేందుకు రూ. 9 వేలు లంచం చెల్లించాలని వేణి ప్రసన్న డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ డీఎస్పీ సూచనల మేరకు విజయ్ కుమార్ రూ. 9 వేలను గురువారం వేణి ప్రసన్నకు ఐఅండ్‌పీఆర్ కార్యాలయంలో ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేసి విచారణ చేపట్టారు. రూ. 9 వేలను రికవరీ చేశారు. వేణి ప్రసన్నను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఆమెను కరీంనగర్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. దాడిలో ఇన్‌స్పెక్టర్లు నగేష్, శ్రీనివాసులు ఉన్నారు.

కలెక్టరేట్‌లో కలకలం..

కలెక్టరేట్‌లో సమాచారశాఖలో ఏసీబీ అధికారులు దాడి చేయడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. ఏ శాఖ అధికారిని పట్టుకున్నారని ఇతర శాఖల అధికారులు ఆరా తీశారు. కలెక్టరేట్‌ను కొత్త భవనంలోకి మార్చిన తర్వాత రెండుసార్లు ఏసీబీ అధికారులు దాడులు జరిగాయి. గతంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్యాంసుందర్‌రెడ్డి ఏసీబీకి చిక్కారు. కాగా గత వారం రోజుల్లో జిల్లాలో రెండో ఏసీబీ కేసు నమోదు కావడం అధికార వర్గాల్లో కలకలం సృష్టిస్తోంది.

బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం

- లిక్కర్ కేసులో కవితను అందుకే అరెస్ట్ చేయట్లేదు
- రాహుల్‌పై ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు అహంకారపూరితమైనవి
- జిల్లాలో అసెంబ్లీ స్థానాలన్నీ హస్తానివే..
- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి

ఖలీల్‌వాడి : బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య లోపాయికారి ఒప్పందం ఉండటంతోనే లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేయట్లేదని, జిల్లాలో రాహుల్ గాంధీ పర్యటనతో అసెంబ్లీ స్థానాలన్నీ కాంగ్రెస్‌వేనని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్, మాజీ మంత్రివర్యులు సుదర్శన్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో రాహుల్ గాంధీ విజయభేరి యాత్రను సక్సెస్ చేయాలన్నారు. జిల్లాలోని కమ్మర్‌పల్లి నుంచి మోర్తాడ్ బస్ స్టాండ్ వద్ద రాహుల్ గాంధీ కార్నర్ మీటింగ్ నిర్వహించి, ఆ తర్వాత ఆర్మూర్‌లోని కార్నర్ మీటింగ్‌లో ప్రసంగిస్తారన్నారు. ఎమ్మెల్సీ కవిత రాహుల్‌పై చేసిన వ్యాఖ్యలు అధికార దురహంకారానికి నిదర్శనమని, పొలిటికల్ టూరిస్ట్ అనడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేటీఆర్, కవిత అమెరికాలో ఉండి టూరిస్ట్‌లుగా తెలంగాణకు వచ్చి పదవులు అనుభవిస్తున్నారన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు సిరుగుప్ప ఎమ్మెల్యే బీఎం నాగరాజు, పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్ హందన్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు, రూరల్ ఇన్‌చార్జి భూపతిరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నర్సారెడ్డి, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు అన్వేష్ రెడ్డి, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పగంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్, రత్నాకర్, మాజీద్ ఖాన్ ఉన్నారు.



మాట్లాడుతున్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్

కాంగ్రెస్‌వి ఆపదమొక్కుల వాగ్దానాలు

- రాహుల్ ప్రసంగాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు
- కుటుంబ పాలన గురించి మాట్లాడే అర్హత ప్రియాంకగాంధీకి లేదు
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

పెర్కిట్(ఆర్మూర్) : అధికారం చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఆపద మొక్కుల వాగ్దానాలతో కుటిల ప్రయత్నం చేస్తోందని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో గురువారం ఎమ్మెల్యే జీవన్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. రూ. లక్ష కోట్లు వ్యయం కాని కాళేశ్వరం, మిషన్ భగీరథ ప్రాజెక్టుల్లో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందన్న రాహుల్ గాంధీ ప్రసంగాన్ని విని ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ఎవరో రాసి ఇచ్చిన స్క్రిప్టును రాహుల్ చదువుతున్నారన్నారు. కమీషన్లు తీసుకుంటే చెరువుల్లో నీళ్ల నిండేవా పొలాలకు నీళ్లందుతాయా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో అవినీతి జరిగింది కాబట్టే ఎస్సారెస్పీ నిర్మాణానికి 60ఏళ్లు పట్టిందన్నారు. కేంద్రం ఇచ్చిన హామీలపై రాహుల్ ఏనాడు పార్లమెంట్‌లో మాట్లాడలేదన్నారు. ఆర్మూర్‌కు వస్తున్న రాహుల్‌కు ఈ ప్రాంతంలో ఎన్ని లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు చేపడుతున్నామో తెలియజేస్తామన్నారు. నెహ్రూ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్‌గాంధీ కుటుంబ పాలన గురించి మాట్లాడితే విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ ద్రోహి కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు. ఈ సమావేశంలో తెలంగాణ మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగా రెడ్డి, ఎంపీపీ పస్క నర్సయ్య, జెడ్పీటీసీ సంతోష్, అంకాపూర్ ఉప సర్పంచ్ మచ్చర్ల కిషోర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పండిత్ వినీత పవన్, ఎంపీటీసీ ఎంసీ గంగా రెడ్డి, సర్పంచ్‌లు పుట్టింటి లింబా రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పూజ నరేందర్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

క్లుప్తంగా

పంట పొలాల పరిశీలన



ఎడపల్లి: మండల కేంద్రంలోని పంట పొలాలను జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ గురువారం పరిశీలించారు. డిజిటల్ క్రాఫ్ సర్వేలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో సిబ్బంది చేపడుతున్న ఫొటో క్యాప్చరింగ్ సరిగా జరుగుతుందో పరిశీలించి పలు విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి సిద్ధిరామేశ్వర్, ఏఈవో సప్తగిరి, జ్యోతి తదితరులు ఉన్నారు.

ఎస్సైకి సన్మానం

భిక్కనూరు: మండల కేంద్రంలో భిక్కనూరు ఎస్సై సాయికుమార్‌ను గంప గోవర్ధన్ సైన్యం ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. శాంతి భద్రతల పరిరక్షణకు సాయికుమార్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గంప గోవర్ధన్ సైన్యం మండలాధ్యక్షుడు బోండ్ల సునీల్, ప్రతినిధులు నిఖిల్, సాయి, చింటూ, నర్సింహ, శివ, మూర్తి, కిరణ్ పాల్గొన్నారు.

బతుకమ్మ నిమజ్జనంలో అపశృతి

– మంగళ్‌పాడ్ చెరువులో ఒకరి మృతి



సతీశ్(ఫైల్)

ఎడపల్లి: మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామంలో గురువారం నిర్వహించిన బతుకమ్మ నిమజ్జనంలో అపశృతి చోటు చేసుకుంది. గ్రామ చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు వచ్చిన తక్కెల సతీశ్ (40) తన ఇంటి బతుకమ్మను చెరువులో నిమజ్జనం చేసి ఒడ్డుకు వస్తుండగా నీట మునిగిపోయాడు. గమనించిన స్థానికులు గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పోలీస్ అమరుల కుటుంబాలకు పరామర్శ



ఖలీల్‌వాడి: పోలీసు అమరవీరుల వారోత్సవాల భాగంగా కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అమరుల కుటుంబాలను అదనపు డిప్యూటీ కమిషనర్ గిరిరాజ్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా అమరుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళి అర్పించారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయ సహకారాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏసీపీ అరుణ్ కుమార్, ఎస్‌బీ సీఐ గన్వంత్‌రావు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు షకీల్ పాషా, ఎస్సైలు ఉన్నారు.

జైతాపూర్‌లో బంగారు గొలుసు చోరీ



ఎడపల్లి: మండలంలోని జైతాపూర్‌లో దుండగుడు ఓ మహిళ మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును దొంగిలించినట్లు ఎస్సై విక్రం గురువారం తెలిపారు. గ్రామంలో శివమ్మ, శారద అనే మహిళలు రోడ్డుపై నడుచుకుంటు వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి అడ్రస్ అడుగుతున్నట్లు నటించి శారద మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును దొంగిలించి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నాడు కాంగ్రెస్ కంచుకోట.. నేడు బీఆర్‌ఎస్ అడ్డా

- కామారెడ్డి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 16సార్లు ఎన్నికలు
- ప్రధాన పార్టీలను ఆదరించిన ఓటర్లు
- ఏడుసార్లు కాంగ్రెస్, ఐదుసార్లు టీడీపీ, మూడుసార్లు బీఆర్‌ఎస్ ప్రాతినిధ్యం..
- ఒకసారి ఇండిపెండెంట్‌కూ అవకాశం
- ఐదుసార్లు గెలిచి గంప రికార్డు
- 17వ ఎన్నికలో గెలిచేది ఎవరో?



కామారెడ్డి నియోజకవర్గ మ్యాప్

కామారెడ్డి క్రైం: కామారెడ్డి నియోజకవర్గం ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోటగా ఉండేది. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు అడ్డాగా మారింది. అసెంబ్లీ ఎన్నికల నగారా మోగడంతో కామారెడ్డిలో రాజకీయ వేడి పెరిగింది. ఏకంగా సీఎం కేసీఆర్ ఇక్కడి నుంచి పోటీ చేస్తుండడంతో పార్టీల కార్యకలాపాలు జోరందుకున్నాయి. 1952లో ఏర్పడిన కామారెడ్డి నియోజకవర్గంలో ఇప్పటికీ ఓటర్లను ప్రభావితం చేసే అంశాలు ఎన్నో ఉన్నాయి. ఒకప్పుడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోటలా ఉండేది. తెలంగాణ ఉద్యమం తర్వాత 2011 నుంచి నియోజకవర్గ ఓటర్లు బీఆర్‌ఎస్ వైపు నిలిచారు. అక్కడి నుంచి టీడీపీ కంచుకోటలో బీఆర్‌ఎస్ పాగా వేసినట్లయింది. కానీ మొదటిసారి టీడీపీ జోరుకు బ్రేకులు వేసింది మాత్రం కాంగ్రెస్సే. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 15 సార్లు సాధారణ ఎన్నికలు, 2012లో ఒకసారి ఉప ఎన్నిక జరిగాయి. కాంగ్రెస్ 7 సార్లు, టీడీపీ 5 సార్లు, బీఆర్‌ఎస్ 3 సార్లు విజయం సాధించగా ఒక సారి ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపొందారు. ఓటర్లు మాత్రం ప్రజా సమస్యలను పరిష్కరించే నాయకులకే పట్టం కడుతున్నారు.

అత్యధిక విజయాలు..

1952లో ఏర్పడిన కామారెడ్డి నియోజకవర్గంలో మొదటిసారి నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీడిపల్లి విఠల్‌రెడ్డి గెలుపొందారు. 1967లో స్వతంత్ర అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి గెలుపు మినహా 1978 వరకు ఐదు పర్యాయాలు కాంగ్రెస్ హవా నడిచింది. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పార్టీ పెట్టాక నియోజకవర్గం టీడీపీకి పెట్టని కోటగా మారింది. 1983లో టీడీపీతో పొత్తులో భాగంగా టికెట్ దక్కించుకున్న సంజయ్ విచార్ మంచ్ పార్టీ అభ్యర్థి పార్శి గంగయ్య గెలిచారు. 1985లో కృష్ణమూర్తి, 1994, 1999, 2009 లోనూ టీడీపీ అభ్యర్థులే విజయం సాధించారు. మొత్తం ఐదు సార్లు టీడీపీ అభ్యర్థులనే ఓటర్లు గెలిపించారు. కానీ 1989లో టీడీపీ జోరుకు బ్రేకులు వేసింది మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్ అలీయే. 1994 నుంచి ప్రధానంగా గంప, షబ్బీర్‌అలీల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. 2004లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల పొత్తులో భాగంగా నియోజకవర్గాన్ని కాంగ్రెస్‌కు కేటాయించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ పొత్తు పెట్టుకోగా కామారెడ్డి నుంచి బీజేపీ అభ్యర్థి మురళీధర్ గౌడ్ పోటీ చేయగా షబ్బీర్ అలీ భారీ మెజార్టీతో గెలిచి వైఎస్‌ఆర్ క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. 2009లో టీడీపీ, బీఆర్‌ఎస్‌ల మధ్య కుదిరిన పొత్తులో భాగంగా కామారెడ్డి టిక్కెట్ టీడీపీకి కేటాయించారు. కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్న షబ్బీర్‌అలీపై గంపగోవర్ధన్ విజయం సాధించారు. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున లేవడంతో 2011లో గంపగోవర్ధన్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో 2012లో ఉప ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఎడ్ల రాజిరెడ్డి పై బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసిన గంపగోవర్ధన్ గెలవడంతో కామారెడ్డి స్థానం బీఆర్‌ఎస్ ఖాతాలోకి చేరింది. 2014, 2018 సాధారణ ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ హవా కొనసాగింది. ఐదో సారి గెలిచిన గంప వరుసగా రెండో సారి ప్రభుత్వ విప్ అయ్యారు.

ప్రభావం చూపే అంశాలు..

ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో ప్రజా సమస్యలు, సామాజిక అంశాలు ఎంతగానో ప్రభావం చూపించాయి. నియోజకవర్గంలో తాగు, సాగునీటికి తీవ్రమైన సమస్య ఉండేది. రూ.140 కోట్లతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్ శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కామారెడ్డికి పైప్‌లైన్ ద్వారా తాగునీటిని అందిచేందుకు 2008లో గోదావరి జలాల తాగునీటి పథకానికి మంజూరు ఇచ్చారు. దీంతో కొంత మట్టుకు సమస్యకు పరిష్కారం దొరికినట్లయింది. నియోజకవర్గంలో సాగునీటి వసతులు ఏమాత్రం లేవు. చెరువులు, బోర్లపైనే ఆధారం. 2008లో నియోజకవర్గానికి సాగునీటిని అందించి సస్యశ్యామలం చేసే ఉద్దేశంతో ప్రాణహిత-చేవెళ్ల 22 ప్యాకేజీ పనులకు వైఎస్‌ఆర్ శంఖుస్థాపన చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక ఈ పనులను రీడిజైన్ పేరుతో నిలిపివేసింది. దీంతో రైతులకు సాగునీటి కష్టాలు తీరలేదు. 22 ప్యాకేజీ పనులు చేపట్టాలనేది ఇక్కడి రైతుల ప్రధానం డిమండ్. నియోజకవర్గంలోని రైతులు ఎక్కువగా చెరుకు పండించేవారు. ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో చెరుకు రైతులు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో చెరుకు సాగు తగ్గిపోయింది. నల్ల బెల్లంపై ఆంక్షలు ఎత్తివేయాలనే డిమాండ్ ఉంది. విద్యాపరంగా ఎంతో వెనుకబడి ఉన్న కామారెడ్డి ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దాలనే డిమాండ్ ఉంది. టెక్నికల్, మెడికల్ కళాశాలలు నెలకొల్పాలని ఎంతోకాలంగా ప్రజలు కోరుకుంటున్నారు. వాటిలో మెడికల్ కళాశాల ఏర్పాటు ఒక్కటే పూర్తయింది. ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు లేక వేల సంఖ్యలో యువత, నిరుద్యోగులు గల్ఫ్‌బాట పడుతున్నారు. సౌత్‌క్యాంపస్, కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆస్తుల పరిరక్షణ, దోమకొండలో డిగ్రీ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలింది. జిల్లా కేంద్రంలో ఎంతో ప్రాధాన్యత కలిగిన రైల్వేఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం లాంటి అంశాలు సైతం ఎప్పటిలాగే రానున్న ఎన్నికల్లో ప్రభావితం చూపించనున్నాయి.

కామారెడ్డి నియోజకవర్గ స్వరూపం

మండలాలు 7: కామారెడ్డి, భిక్కనూర్, మాచారెడ్డి, దోమకొండ, బీబీపేట్, రాజంపేట, పాల్వంచ. ఆయా మండలాల పరిధిలో 103 గ్రామ పంచాయతీలున్నాయి. నియోజకవర్గంలో మొత్తం 266 పోలింగ్ బూత్‌లు, 2,45,822 ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,18,718, మహిళలు 1,27,080, ఇతరులు 24 మంది ఓటర్లు ఉన్నారు.

కామారెడ్డి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన వారు..

సంవత్సరం	అభ్యర్థి పేరు	పార్టీ	సంవత్సరం	అభ్యర్థి పేరు	పార్టీ
1952–57	జి. విఠల్‌రెడ్డి	కాంగ్రెస్	1989–94	షబ్బీర్ అలీ	కాంగ్రెస్
	వి.రామారావు	కాంగ్రెస్	1994–99	గంప గోవర్ధన్	టీడీపీ
1957–62	టీఎస్ సదాలక్ష్మి	కాంగ్రెస్	1999–04	యూసుఫ్ అలీ	టీడీపీ
1962–67	వి. వెంకటరామారెడ్డి	కాంగ్రెస్	2004–09	షబ్బీర్ అలీ	కాంగ్రెస్
1967–72	మధుసూదన్‌రెడ్డి	స్వతంత్ర	2009–12	గంప గోవర్ధన్	టీడీపీ
1972–78	వై.సత్యనారాయణ	కాంగ్రెస్	2012–14 (ఉప ఎన్నిక)	గంప గోవర్ధన్	టీఆర్‌ఎస్
1978–83	బ్రహ్మణపల్లి బాలయ్య	కాంగ్రెస్			
1983–85	పార్శి గంగయ్య	టీడీపీ	2014–18	గంప గోవర్ధన్	బీఆర్‌ఎస్
1985–89	ఎ.కృష్ణ మూర్తి	టీడీపీ	2018–23	గంప గోవర్ధన్	బీఆర్‌ఎస్

పసివాడికి ప్రాణం పోశారు..



పాపకు చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

నిజామాబాద్‌నాగారం: అప్పుడే పుట్టిన బిడ్డలో కదలికపోవడంతో కుటుంసభ్యులు చనిపోయిందనుకున్న ఆ పసిప్రాణానికి 108 సిబ్బంది ప్రాణం పోశారు. నగరంలోని దుబ్బ ప్రాంతానికి చెందిన పూజా అనే 5 నెలల గర్భిణికి ఆకస్మత్తుగా పురిటినొప్పులు రావడంతో ఏరియా ఆశా వర్కర్ 108 సిబ్బందికి సమాచారం అందించారు. 108 వాహనం వచ్చేలోగా మహిళ ప్రసవించింది. పాపలో కదలిక లేకపోవడంతో కుటుంబ సభ్యులు చనిపోయిందని గమనించి ఆశలు వదిలేసుకున్నారు. అక్కడికి చేరుకున్న సిబ్బంది పాప మెడ చుట్టూ అంబులికర్‌కాడ్ చుట్టుకొని ఉన్నట్లు గమనించి సీపీఆర్ చేశారు. దీంతో పాపలో కదలిక వచ్చింది. వెంటనే ప్రత్యేక అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రిలోకి తరలించారు. ప్రస్తుతం పాప పరిస్థితి నిలకడగానుందని వైద్యులు తెలిపారు. పసిపాప ప్రాణాలు కాపాడిన సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీలో పలువురి చేరిక

రాజంపేట: మండల కేంద్రానికి చెందిన 32 మంది మహిళలతోపాటు మొత్తం 106మంది బీజేపీ కామారెడ్డి అసెంబ్లీఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి వెంకటరమణారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ముదిరాజ్‌లను విస్మరిస్తే గుణపాఠం



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీల నాగరాజు

భిక్కనూరు: ముదిరాజ్‌లను విస్మరించే పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీల నాగరాజు పిలుపునిచ్చారు. మండలంలోని పెద్దమల్లారెడ్డిలో గురువారం ముదిరాజ్‌ల సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఒక్క అసెంబ్లీ టికెట్ ఇవ్వకపోవడం ఆ పార్టీ నేతలకు ముదిరాజ్‌లపై ఉన్న చిన్నచూపునకు నిదర్శనమన్నారు. ప్రతి గ్రామం నుంచి నలుగురు ముదిరాజ్‌లు సీఎం కేసీఆర్‌పై పోటీచేసి ఆయన ఓటమికి కారణం కావాలన్నారు. నామినేటేట్ పోస్టులను ఎర చూపి ముదిరాజ్‌లను బీఆర్‌ఎస్ మోసం చేస్తోందని విమర్శించారు. సమావేశంలో ముదిరాజ్ సంఘం నాయకులు నీరడి ఆంజనేయులు, బుడ్డ రెడ్డయ్య, యాదగిరి, కొండ సాయిలు, మాలే నారాయణ, పిల్లి రమేశ్, సంతోష్, పుట్ట సిద్దరాములు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

నవీపేట: మల్కాపూర్(ఏ) గ్రామానికి చెందిన వివాహిత దోసపల్లి విజయ(42) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. విజయ తోటి కోడలైన లక్ష్మి అదే గ్రామానికి చెందిన చంద్రయ్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈవిషయమై పలుమార్లు ఇరువురిని విజయ హెచ్చరించినా వారిలో మార్పు రాలేదు. దీంతో అవమానంగా భావించిన విజయ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. మృతురాలి సోదరుడు నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నగదు లావాదేవీలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : సాధారణ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో నగదు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు బ్యాంకర్లకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. రూ.10 లక్షలు, అంతకంటే పెద్ద మొత్తంలో నగదు డిపాజిట్, విత్‌డ్రా జరిపే వారి వివరాలు ఎన్నికల వ్యయ పరిశీలకుల దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్ పేర్కొన్నారు. అదేసమయంలో వ్యవసాయ పనులు, వ్యాపార అవసరాలకు నగదు లావాదేవీలు జరిపే వారికి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థి ఎన్నికల ఖర్చు రూ.40 లక్షలకు మించకూడదని, అభ్యర్థులు ఒకే బ్యాంకు ఖాతా ద్వారా లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పి యాదిరెడ్డి, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ శ్రీనివాస్‌రావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

సుభాష్‌నగర్ : రైతులు సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు గురువారం ప్రకటనలో తెలిపారు. సంఘాల ధాన్యం విక్రయిస్తే డబ్బులు నేరుగా బ్యాంకుల్లో జమవుతాయన్నారు. ఏ గ్రేడ్ ధాన్యం రూ. 2,203, కామన్ ధర రూ. 2,183 కనీస మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 2023–24, 1.65 లక్షల హెక్టార్లలో ధాన్యం పండించగా సుమారు 11.56 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానుందన్నారు. 8.00 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంను, జిల్లాలో 373–ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, 64 ఐకేపీ సెంటర్ల ద్వారా, 36 ఐడీసీఎంఎస్, 5–కేపీపీఎస్ఎస్, 6– ఎంఈపీడబ్లు 6 –ఏఎంసీ మొత్తం 490 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు.

క్రైం కార్నర్

రైలు ఢీ కొని వృద్ధుడి మృతి



సిద్యా నాయక్ (ఫైల్)

రాజంపేట: రైలు ఢీ కొని వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని తలమడ్ల శివారులో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరెపల్లి తండాకు చెందిన సబావత్ సిద్యా నాయక్(79) ఆరెపల్లి నుంచి కామారెడ్డికి వెళ్తుండగా తలమడ్ల శివారులో రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొని మృతిచెందాడు. రైల్వే సిబ్బంది మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వృద్ధుడి మృతికి రైల్వే పనులు చేస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమని గ్రామస్తులు తెలిపారు. తలమడ్ల శివారులో నిర్మిస్తున్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణంతో తలమడ్ల, ఆరెపల్లి గ్రామస్తులు ఇతర గ్రామాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టాలపై కనీస జాగ్రత్త చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మొరం టిప్పర్ ఢీకొని ఒకరు..

ఎడపల్లి: మండలంలోని జానకంపేట గ్రామంలో మొరం టిప్పర్ ఢీ కొనడంతో ఒకరు మృతి చెందినట్లు పోలీసులు గురువారం తెలిపారు. అబ్బాపూర్‌కు చెందిన నీరడి సాయిలు జానకంపేట నుంచి బైక్‌పై వస్తుండగా వెనుక నుంచి వచ్చిన మొరం టిప్పర్ ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ సాయిలుని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి ..

మద్నూర్: అదృశ్యమైన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన ఘటన డోంగ్లీ మండలంలోని మోగాలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మోగాకు చెందిన పులికండ్లవార్ సంజీవ్ (45) ఈ నెల 17న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. సంజీవ్‌కు గతంలో మద్యం అలవాటు ఉండేది. అనారోగ్య కారణాలతో మద్యం మానివేయడంతో వింతవింతగా ప్రవర్తించేవాడు. గురువారం గ్రామ చెరువులో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా సంజీవ్ మృతదేహంగా గుర్తించారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపు తప్పి కారు బోల్తా

బాల్కొండ: మెండోరా మండల శివారులో కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఒకరికి గాయాలైనట్లు ఎస్సై భాస్కరాచారి గురువారం తెలిపారు. హైదరాబాద్ నుంచి కారులో డ్రైవర్ అయూబ్ ఆదిలాబాద్‌కు ఒంటరిగా వెళ్తుండగా అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ అయూబ్‌ను నిర్మల్ ఆసుపత్రికి తరలించినట్లు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వడ్ల కుప్పని ఢీకొని ఒకరికి గాయాలు

ఎడపల్లి: మండల కేంద్రానికి చెందిన తాపీ మేస్త్రి ఏడుకొండలు గురువారం నిజామాబాద్ నుంచి ఎడపల్లికి బైక్‌పై వెళ్తుండగా ప్రధాన రహదారిపై ఆరబోసిన ధాన్యం కుప్పను ఢీకొన్నాడు. ఈ ఘటనలో కింద పడ్డ ఏడుకొండలు తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఒకరిపై కేసు నమోదు

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి పెద్దచెరువులోని కొంగల గుండు వద్ద చేపల దొంగతనానికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు. పొందుర్తి గ్రామానికి చెందిన తిరుగుడు స్వామి చెరువులో చేపలు పడుతుండగా గమనించిన చెరువు కాపలాదారులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు ఒకరి మృతి



అంజయ్య మృతదేహం

నిజామాబాద్ రూరల్: రూరల్ పీఎస్ పరిధిలోని గంగాస్థాన్–2 ప్రాంతంలో డ్రైనేజీని జెడ్ పంపుతో శుభ్రపరుస్తుండగా ప్రమాదవశాత్తు ఒకరు మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో మహేశ్‌కుమార్ గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మాక్లూర్ మండలం బోర్గం గ్రామానికి చెందిన జెర్రిపోతుల అంజయ్య (48) మున్సిపల్ లేబర్ పని చేస్తున్నాడు. రోజువారి పనిలో భాగంగా అశోక ఎవెన్యూ ముందు ఉన్న అండర్ డ్రైనేజీని జెడ్ మిషిన్‌తో శుభ్రం చేస్తుండగా మిషిన్ పైపు ప్రమాదవశాత్తు అంజయ్య చెవి భాగంలో బలంగా తగలడంతో కిందపడిపోయాడు. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

సిలిండర్ పేలి సైకిల్ దుకాణం దగ్ధం



మాక్లూర్: ప్రమాదవశాత్తు సిలిండర్ పేలి సైకిల్ దుకాణం దగ్ధమైన ఘటన కొత్తపల్లిలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సర్పంచ్ వేములపల్లి సుబ్బారావు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లేశ్ నూతనంగా నిర్మించిన ఇంట్లో సైకిల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇందులో సైకిల్ షాప్, కరెంటు సామాగ్రిని పెట్టినట్లు తెలిపారు. అర్ధరాత్రి సిలిండర్ పేలడంతో దుకాణంలోని సామాగ్రి, విద్యుత్ పరికాలు దగ్ధమయ్యాయి. దీంతో సుమా రు రూ. 4 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని సర్పంచ్ సుబ్బారావు తెలిపారు. ప్రమాద ఘటనలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు.

తనిఖీల్లో నగదు పట్టివేత



కామారెడ్డిలో పట్టుకున్న నగదుతో పోలీసులు

కామారెడ్డి క్రైం/ నాగిరెడ్డిపేట/ బాన్సువాడ రూరల్/ భిక్కనూరు/బోధన్‌టౌన్: కామారెడ్డి మున్సిపల్ సమీపంలో వాహనాల తనిఖీలో ఓ వ్యక్తి నుంచి రూ.1,17,240, సిరిసిల్లా రోడ్‌లో మరొకరి నుంచి రూ.70 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరేశ్ తెలిపారు. నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ బృందానికి అప్పగించినట్లు పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లో ఒకరి నుంచి రూ.లక్షా13వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. నగదుకు సంబంధించి ఆధారాలు చూయించకపోవడంతో ఏఫ్ఎస్‌టీ టీంకు నగదును అప్పగించారు. బాన్సువాడలో వారాంతపు సంత పూర్తిచేసుకుని స్వగ్రామాలకు వెళ్తున్న ముగ్గురు వ్యాపారుల నుంచి రూ.2.90,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. తాడ్కోల్ వైపు స్కూటీపై వెళ్తున్న ఒకరి నుంచి రూ.లక్ష స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. భిక్కనూరు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద రెండు వాహనాల నుంచి రూ. 2,42,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదును కామారెడ్డి ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు.

బోధన్ పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో పోలీసులు నాందేడ్ నుంచి వస్తున్న ఓ వ్యాపారవేత్త నుంచి రూ. నాలుగు లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. గన్నీ బ్యాగుల కొనుగోలుకు నగదును తీసుకెళ్తున్నట్లు సదు వ్యాపారి తెలుపగా ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు.



బాన్సువాడలో..



భిక్కనూరులో..

మద్యం పట్టివేత



యంచ వద్ద మద్యం పట్టుకున్న పోలీసులు



తలాబ్ తండాలో..

నవీపేట/ పెద్దకొడప్‌గల్: నవీపేట మండలంలోని యంచ చెక్‌పోస్ట్ వద్ద బుధవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ పోతారెడ్డి గురువారం తెలిపారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి నిజామాబాద్ వైపు బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకుల నుంచి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.75 వేలు ఉంటుందని అన్నారు. పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో ఒకరు మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై కోనారెడ్డి తెలి పారు. మండల కేంద్రం నుంచి తలాబ్ తండాకు మద్యం తీసుకెళ్తున్న ఒకరిని అరెస్టు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

‘అండర్‌గ్రౌండ్’ రాజకీయం

- నగరంలో ఏళ్లుగా కొనసాగుతున్న పనులు
- నాణ్యత ప్రమాణాలు తూచ్
- నిధులు నీళ్లపాలు


నగరంలో అధ్వానంగా ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ

నిజామాబాద్‌నాగారం: నగరంలో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ఉమ్మడి రాష్ట్రంలో మొదలై ప్రత్యేక రాష్ట్రంలోనూ పూర్తి కావడంలేదు. 14 ఏళ్లుగా కొనసాగుతున్న పనులు రాజకీయ అంశంగా మారాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం వేలెత్తి చూపేలా ‘అండర్ గ్రౌండ్ డ్రైనేజీ’ రాజకీయమైంది. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పనిచేసిన ధర్మపురి శ్రీనివాస్ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టారు. 2008లో పనులను ప్రారంభించి నగరంలోని ప్రధాన రోడ్లను తవ్వేశారు. పనులు నత్తనడకన కొనసాగగా, ఏళ్లపాటు నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పనులను పూర్తిచేస్తామని ప్రకటించింది. ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను పూర్తి చేశామని, ప్రతి సమావేశంలో పదేపదే చెబుతూ వచ్చారు. ఆచరణలో మాత్రం పరిస్థితి మరోవిధంగా ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పనులను వేగంగా పూర్తి చేయాలనే ఉద్దేశంతో పైప్‌లైన్ వేసిన అనంతరం హడావుడిగా పూడ్చివేశారు. ఫలితం ఇప్పుడు డ్రైనేజీలు కుంగిపోతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. కారణం మీరంటే మీరంటూ విమర్శలు చేసుకునే పరిస్థితి నెలకొంది.

నిండా నిర్లక్ష్యం

2008లో రూ.94 కోట్లతో అండర్‌గ్రౌండ్‌డ్రైనేజీ పనులను పూర్తి చేస్తామని చెప్పినప్పటికీ.. మధ్యలోనే ఆగిపోయాయి. అప్పట్లో ప్రధాన రోడ్లను తవ్వేసి నెలలతరబడి వదిలేశారు. పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ఏళ్లు పట్టింది. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంచనా విలువ రూ.231 కోట్లకు పెంచి ప్రతిపాదనలను రూపొందించారు. మళ్లీ ప్రత్యేకంగా రూ.85 కోట్లకు ప్రతిపాదనలు పంపారు. ఇలా 14 ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి చేయలేకపోయారు. మురుగునీటిని శుద్ధి చేసేందుకు న్యూకలెక్టరేట్ ప్రాంతంలో 31.5 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో ఓ ట్యాంకు, ఎల్లగుట్టలో 15 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో మరో ట్యాంకు నిర్మించారు.

అనుమతిస్తేనే ఇళ్లకు కనెక్షన్

ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే నగరంలోని ఇళ్లకు అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ కనెక్షన్లు ఇవ్వనున్నారు. రెండేళ్ల క్రితం నిధులు, అనుమతి కోసం ప్రభుత్వానికి విన్నవించారు. పనులు పూర్తి చేసినప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు.

విలీన గ్రామాల్లో వ్యవస్థే లేదు

మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇటీవల విలీనమైన గ్రామాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేదు. మానిక్‌బండార్, బోర్గాం(కె) ఖానాపూర్, కాలూర్, సారంగపూర్, బోర్గాం(పి) పాంగ్రా, మాధవనగర్, ముబారక్‌నగర్, గూపన్‌పల్లి గ్రామాల్లో అండర్‌గ్రౌండ్ వ్యవస్థ లేదు.

పని చేయని వ్యవస్థ

నగరంలోని చాలా కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ పనులు పూర్తికాకపోవడంతో ఇళ్లలో నుంచి మురుగు నీటిని ఎప్పటిలాగే డ్రైనేజీల ద్వారా బయటికి పంపిస్తున్నారు. నగరంలో కేవలం 75శాతం పనులు పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఆచరణలో మాత్రం పెద్దగా కనిపించడం లేదని నగరవాసులు ఆరోపిస్తున్నారు. పైపులైన్ వేసినా కనెక్షన్లు ఇవ్వకపోవడంతో ఎప్పటిలాగే మురుగునీరు కాల్వల ద్వారా బయటకి వెళ్తున్నది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు నగరంలో చాలా చోట్ల ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. పర్యవేక్షణలోపం కారణంగానే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పని చేయట్లేదని నగరవాసులు ఆరోపిస్తున్నారు.

నిధులు లేక పనులు ఆపేశాం

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు నిధులు ఉన్నంతవరకు చేశాం. పనులు ఆపేసి సుమారు మూడేళ్లు అవుతున్నది. ఇళ్లకు పైపులైన్ ఇవ్వలేదు. నిధులు రాగానే మిగతా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.

– నరేశ్, పబ్లిక్ అండ్ హెల్త్ డిప్యూటీ ఈఈ

‘ఉపాధి’లో అక్రమాలకు చెక్

- బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం


రాజంపేట మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

రాజంపేట: ఉపాధి హామీ కూలి చెల్లింపుల్లో అక్రమాలను అరికట్టి, నేరుగా కూలీల బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమ చేసేలా కేంద్రం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కూలీల జాబ్‌కార్డులు, బ్యాంక్ ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేయాలని ఆదేశించింది. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు 98శాతం అనుసంధానం పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఏడాదిన్నర క్రితమే ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా ఆధార్, జాబ్‌కార్డుల్లోని పేర్లు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. తాజాగా ఆధార్ అనుసంధాన గడువు ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు పొడిగించడంతో వంద శాతం నమోదు దిశగా అధికారులు ముందుకు సాగుతున్నారు.

ఉపాధి కూలీల జాబ్ కార్డులు, బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయడంతో కూలి చెల్లింపుల్లో అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది. ఇది వరకు కూలి చెల్లింపులను గ్రామాల్లోని తపాల శాఖకు సంబంధించిన బీపీఎంల ద్వారా చేపట్టేవారు. దీంతో డబ్బులు వచ్చిన విషయం తెలిసిన వెంటనే కూలీలు వారి వద్ద బారులు తీరేవారు. అయితే కొంతమంది బీపీఎంలు కూలీలకు డబ్బులు చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడినట్లుగా ప్రభుత్వం గుర్తించింది. కూలీల వేలిముద్రలు వేయించుకుని కొంతవరకే డబ్బు చెల్లించి మిగతా మొత్తం కొంతమంది తమ జేబుల్లో వేసుకున్నట్లుగా తేల్చింది. ఇలాంటి అక్రమాలను అరికట్టి ఉపాధి కూలీల నగదు మొత్తాన్ని నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఈ విధానం అమలవుతుండగా వచ్చే ఏడాది జనవరి 1 నుంచి పూర్తిస్థాయిలో బ్యాంక్ ఖాతాల ద్వారానే చెల్లింపులు చేయాలని భావిస్తుంది. ఇందుకోసం కార్డులకు ఆధార్ అనుసంధానం చేస్తుంది.

త్వరలోనే వంద శాతం పూర్తి



ఉపాధి హామీ పనులకు వచ్చే ప్రతీ కూలీ జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం చేస్తున్నాం. రాజంపేట మండలంలో ఇంకా సుమారు 500 మంది కూలీల ఆధార్ అనుసంధానం చేయాల్సి ఉంది. త్వరలోనే వంద శాతం పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.

– భాస్కర్, ఏపీవో రాజంపేట

హోరాహోరీగా కబడ్డీ టోర్నీ



నిజాంసాగర్: ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ మహమ్మద్‌నగర్ మండలం నర్వ గ్రామంలో గురువారం ప్రారంభమైంది. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని ఆయా మండలాల నుంచి 24 టీంలు పోటీల్లో పాల్గొంటున్నాయి. రెండు రోజులు పాటు పోటీలు ఉంటాయని నిర్వాహకులు మోతుల్క హరీశ్‌గౌడ్, నామ రాజు తెలిపారు. రాకేశ్‌గౌడ్, ఈశ్వర్, రాజేందర్, రవీ, సాయిలు, రాజు, గూల సంతోష్, రుద్ర శేఖర్, మోహన్, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానక్షేత్రంలో పండ్లతోటల పునరుద్ధరణ

నాగిరెడ్డిపేట: మండలంలోని మాల్తుమ్మెద ఉద్యాన క్షేత్రంలో పండ్ల తోటల పునఃరుద్ధరణకు అధికారులు చర్యలు చేపట్టారు. పిచ్చిమొక్కలతో నిండి నిర్వాహణకు నోచుకొని ఉద్యానక్షేత్రంలో ఇప్పుడిప్పుడే పునఃరుద్ధరణ పనులు మొదలయ్యాయి. మాల్తుమ్మెద శివారులో 1982లో 60ఎకరాలను కేటాయిస్తూ అప్పటి ప్రభుత్వం ఉద్యానక్షేత్రాన్ని ఏర్పాటు చేసింది. అప్పట్లో ఈ క్షేత్రంలో విభిన్న రకాలైన పండ్ల, పూల మొక్కలను ఉత్పత్తి చేసేవారు. సుమారు 20మంది ఉద్యోగులు విధులు నిర్వహించేవారు. అలాంటిది ప్రస్తుతం ఉద్యానక్షేత్రంలో నిర్లక్ష్యపు నీడలు అలుముకున్నాయి. ప్రస్తుతం కేవలం ద్దరు దినసరి కూలీలతో ఉద్యాన క్షేత్రాన్ని నిర్వహిస్తున్నారు.

ఆపిల్ బెర్రీ, దానిమ్మ తోటల తొలగింపు

ఉద్యాన క్షేత్రానికి 2014లో అప్పటి వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి రూ.కోటి49లక్షల నిధులను కేటాయించి అభివృద్ధి పనులను చేపట్టారు. దీనిలో భాగంగా మూడెకరాల్లో దానిమ్మ, 2.7ఎకరాలలో ఆపిల్ బెర్రీ మొక్కలను నాటారు. పండ్ల మొక్కలు నాటి సుమారు పదేళ్లవుతున్నా ఒక్కయేడు కూడా వాటి నుంచి దిగుబడి రాలేదు. దీంతో దానిమ్మ, ఆపిల్ బెర్రీ మొక్కలను తొలగించి మామిడి మొక్కలను నాటేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

కేసరి, అంబిక మామిడి రకాల ఎంపిక

ఉద్యాన క్షేత్రంలో ప్రస్తుతం ఏడెకరాల్లో కేసరి, అంబిక రకాలకు చెందిన మేలురకం మామిడి మొక్కలను నాటాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం రెండు ఎకరాల్లో ఇదివరకు నాటిన ఆపిల్ బెర్రీ మొక్కలతోపాటు మరో 30గుంటలలో నాటిన దానిమ్మ మొక్కలను తొలగిస్తున్నారు. 35 ఏళ్ల క్రితం నాటిన జామ మొక్కల నుంచి దిగుబడి తగ్గడంతో కొమ్మలను కత్తిరించి పునఃరుద్ధరణ చేస్తున్నారు.


మామిడి మొక్కలు నాటేందుకు దున్నిన భూమి

మామిడి మొక్కలు నాటుతాం

దిగుబడి రాకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆపిల్ బెర్రీ, దానిమ్మ మొక్కలను తొలగిస్తున్నాం. వాటికి బదులు క్షేత్రంలో మేలురకం మామిడి మొక్కలను నాటేందుకు చర్యలు చేపట్టాం. ఇందుకోసం పనులు కొనసాగుతున్నాయి. – రామకృష్ణ, ఉద్యానశాఖ అధికారి, మాల్తుమ్మెద

రోడ్లపైనే పంట వ్యర్థాలకు నిప్పు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- కాలిపోతున్న హరితహారం మొక్కలు


పంట వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో కాలిపోయిన చెట్టు

బాల్కొండ: ముప్కాల్ మండల పరిధిలోని రైతులు పెద్ద వాగు రోడ్డుపై మక్క కంకులను బూరుతో తీసుకువచ్చి ఆరబెట్టారు. వాటిని నూర్పిడి చేసిన అనంతరం ఆ చెత్తను రోడ్డు పక్కన అలానే వదిలేశారు. ఆ చెత్తకు అక్కడే నిప్పు పెట్టడంతో హరితహారంలో పెంచిన మొక్కలు, చెట్లు కాలిపోతున్నాయి. అంతేకాకుండా నిప్పు పెట్టిన సమయంలో పొగతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు పంట ఆరబెట్టుకొడానికి రోడ్లపై పోస్తున్నారు. ప్రధానంగా పెద్దవాగు రోడ్డు, వేంపల్లి రోడ్డుపై సందు లేకుండ కుప్పలు పోశారు. కానీ అవసరం తీరిన తర్వాత చెత్తను అలాగే వదిలేయడంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. అంతే కాకుండ చెత్తను కుప్పలు , కుప్పలుగా చెట్ల మధ్యలోనే వేసి నిప్పు పెడుతున్నారు. గతేడాది ఇలానే నిప్పు పెట్టడంతో చెట్లు కాలిపోయాయి. ఈ ఏడాది కూడా రోడ్లపక్కన ఉన్న మొక్కలు, చెట్లు కాలిపోతున్నాయి. అధికారులు స్పందించి రైతులకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

వెలమల క్షేత్రం..!

- జీసీలకు రెండేసార్లు అవకాశం
- కార్మిక, కర్షక ప్రాంతం


జీవీ సుధాకర్‌రావు


జీ.వీ.పితాంబర్‌రావు


కొదాటి రాజమల్లు



చుంచు లక్ష్మయ్య


మురళీమనోహర్‌రావు


గోనె హన్మంతరావు


గడ్డం అరవిందరెడ్డి


నడిపెల్లి దివాకర్‌రావు


కే.వి.కిషన్‌రావు



మంచిర్యాల ముఖ చిత్రం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల శాసనసభ నియోజకవర్గం వెలమలకు కంచుకోటగా ఉంటూ వస్తోంది. పునర్విభజనకు ముందు లక్సెట్టిపేట నియోజకవర్గంలో మొదటి నుంచీ అగ్రవర్ణాలకు అధికారం దక్కింది. కార్మిక, కర్షక ఓటర్లు ఎక్కువగా ఉన్నా రాజకీయ ప్రస్థానం అలాగే కొనసాగుతోంది. లక్సెట్టిపేట నియోజకవర్గం 1952లో ఆవిర్భవించింది. ఇప్పటివరకు 16 సార్లు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వెలమ సామాజిక వర్గం నేతలే ఎక్కువ కాలం పాలించారు. 1952లో ద్విసభ్య నియోజకవర్గం కాగా.. సోషలిస్ట్ పార్టీ ప్రభావం ఉన్న రోజుల్లో ఆ పార్టీ తరఫున కోదాటి రాజమల్లు, విశ్వనాథం ఒకే పర్యాయం శాసనసభ్యులుగా ప్రాతినిధ్యం వహించారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో మంచిర్యాల నియోజకవర్గంగా ఆవిర్భవించింది. మొదటి ఎమ్మెల్యేగా గడ్డం అరవిందరెడ్డి టీఆర్ఎస్ నుంచి ఎన్నికయ్యారు. 2010 ఉప ఎన్నికల్లోనూ ఆయన విజయం సాధించారు. 2014 సాధారణ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ నుంచి నడిపెల్లి దివాకర్‌రావు ఎమ్మెల్యేగా గెలుపొందారు.

కీలక పదవులు

లక్సెట్టిపేట నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యేలు కీలక పదవుల్లో కొనసాగారు. జేవీ.నర్సింగరావు పీసీసీ అధ్యక్షుడిగా, ఉప ముఖ్యమంత్రిగా, జీవీ.సుధాకర్‌రావు నీటి పారుదల, రవాణా, చక్కెర శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.

విలక్షణ తీర్పు..

నియోజకవర్గ ప్రజలు విలక్షణమైన తీర్పునిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో హ్యాట్రిక్ సాధించిన ఎమ్మెల్యే లేకపోవడం గమనార్హం. ఇప్పటివరకు జీవీ.పితాంబర్‌రావు, జీవీ.సుధాకర్‌రావు, జేవీ.నర్సింగరావు, దివాకర్‌రావు వరుసగా రెండేసి సార్లు ఎన్నికైనా మూడోసారి ఎన్నికై హ్యాట్రిక్ కొట్టే అవకాశం దక్కలేదు.

కార్మికులు, వ్యవసాయం

మంచిర్యాల నియోజకవర్గానికి తూర్పున సింగరేణి కార్మిక క్షేత్రం, పశ్చిమాన వ్యవసాయ క్షేత్రం ఉండగా, మధ్యలో మంచిర్యాల విద్య, వైద్య, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక కేంద్రంగా ప్రత్యేకతను సంతరించుకుంది. ఏ ఎన్నికల్లో అయినా సింగరేణి క్షేత్రంలోని కార్మికులే నేతల రాతలు మారుస్తున్నారు. 10 వేల వరకు సింగరేణి కార్మిక కుటుంబాలు ఉండగా దాదాపు 45 వేలకు పైగా ఓటర్లు ఉంటారు. బీసీ ఓటర్లు కీలకంగా ఉన్నా చట్టసభకు ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కడం లేదు. 2.65లక్షల పైగా ఓటర్లు ఉండగా ఇందులో దాదాపు రెండు లక్షల వరకు బీసీ ఓటర్లు ఉంటారు.

నియోజకవర్గ స్వరూపం

నియోజకవర్గంలో మంచిర్యాల, నస్పూర్, లక్సెట్టిపేట మున్సిపాలిటీలు, హాజీపూర్, దండేపల్లి మండలాలు ఉన్నాయి. 2,64,515 మంది ఓటర్లు ఉన్నారు. మున్నూరు కాపు, పెరిక ఓటర్ల ప్రాతినిధ్యం అధికంగా ఉండగా ఆ తర్వాత వరుసలో ఎస్సీ, ఎస్టీలు, ముస్లిం మైనారిటీ, బెస్త, వైశ్య, పద్మశాలి, రెడ్డి, వెలమ, ఎల్లాపు ఇతర కులాల వారు ఉంటారు.

ఉప ఎన్నికలు ఇలా..

1973లో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న జేవీ.నర్సింగ్‌రావు అకాల మరణంతో ఉప ఎన్నికలు వచ్చాయి. ఆ ఎన్నికల్లో మందమర్రికి చెందిన న్యాయవాది కేవీ.కిషన్‌రావు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1985లో ఎన్టీ రామారావు ప్రభుత్వం రద్దు కావడంతో ఉప ఎన్నికలు వచ్చాయి. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో మంచిర్యాల ఎమ్మెల్యే గడ్డం అరవింద్ రెడ్డి 2010లో టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు రాజీనామా చేయడంతో ఉప ఎన్నికలు వచ్చాయి. ఉప ఎన్నికల్లో అరవింద్‌రెడ్డి 86 వేల ఓట్ల పై చిలుకు మెజారిటీతో విజయం సాధించారు.

ఎన్నో ప్రత్యేకతలు..

మంచిర్యాల గోదావరి పరీవాహక ప్రాంతం ఉంది. తూర్పున శ్రీరాంపూర్‌లో నల్ల బంగారం నిక్షిప్తమైన సింగరేణి భూగర్భ, ఉపరితల(ఓపెన్ కాస్ట్) గనులు ఉన్నాయి. మంచిర్యాలలో ఎంసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ, పరిసర ప్రాంతాల్లో సిరామిక్ పరిశ్రమలు ఉన్నాయి. ఎల్లంపల్లి శ్రీపాదసాగర్ ప్రాజెక్ట్ ఉంది. లక్సెట్టిపేటలో రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద చర్చి సీఎస్ఐ చర్చి ఉంది. దండేపల్లిలో చిన్నయ్య, పెద్దయ్య గుట్టలతో పాటు చప్పట్లతో జాలువారే నీటి ఊటలు ప్రత్యేకత.

లక్సెట్టిపేట నియోజకవర్గ ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారు..

ఎమ్మెల్యే	పదవీ కాలం	పార్టీ
విశ్వనాథరావు, కోదాటి రాజమల్లు	1952–57	సోషలిస్టు పార్టీ
జీవీ.పితాంబర్‌రావు	1957–62	కాంగ్రెస్
జీవీ.పితాంబర్‌రావు	1962–67	స్వతంత్ర
జేవీ.నర్సింగరావు	1967–72	కాంగ్రెస్
జేవీ.నర్సింగరావు	1972–73	కాంగ్రెస్
కేవీ.కిషన్‌రావు(ఉప ఎన్నిక)	1973–77	కాంగ్రెస్
చుంచు లక్ష్మయ్య	1977–83	జనతా పార్టీ
ఎం.మురళీమనోహర్‌రావు	1983–85	టీడీపీ
జీవీ.సుధాకర్‌రావు(ఉప ఎన్నిక)	1985–89	స్వతంత్ర
జీవీ.సుధాకర్‌రావు	1989–94	కాంగ్రెస్
గోనె హన్మంతరావు	1994–99	టీడీపీ
నడిపెల్లి దివాకర్‌రావు	1999–04	కాంగ్రెస్
నడిపెల్లి దివాకర్‌రావు	2004–09	కాంగ్రెస్
మంచిర్యాల నియోజకవర్గంలో...		
గడ్డం అరవింద్‌రెడ్డి	2009–10	టీఆర్ఎస్
గడ్డం అరవింద్‌రెడ్డి(ఉప ఎన్నిక)	2010–14	టీఆర్ఎస్
నడిపెల్లి దివాకర్‌రావు	2014–18	టీఆర్ఎస్
నడిపెల్లి దివాకర్‌రావు	2018–23	బీఆర్ఎస్

బాసరలో నేడు మూల నక్షత్ర పూజలు


ముస్తాబైన సరస్వతీ ఆలయం

- అధికసంఖ్యలో రానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


బాసరకు పాదయాత్రగా వస్తున్న కామోల్ భక్తులు

భైంసా: దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా బాసరలో శుక్రవారం విశేష మూల నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించనున్నారు. పూజల్లో పాల్గొనేందుకు భక్తులు అధికసంఖ్యలో రానుండడంతో ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ఈవో విజయరామారావు ఇప్పటికే అర్చకులు, సిబ్బందితో సమీక్షలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. శుక్రవారం జ్ఞానసరస్వతీ అమ్మవారి సన్నిధిలో నిర్వహించనున్న అక్షర శ్రీకార పూజలు, అభిషేక పూజల కోసం టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కాగా, మూల నక్షత్రం రోజున పలు ప్రాంతాల నుంచి భక్తులంతా పాదయాత్రగా బాసరకు వస్తుంటారు. ఒకరోజు ముందే చేరుకుని అమ్మవారి ఆలయంలో బసచేస్తారు. మూల నక్షత్రం సందర్భంగా అమ్మవారిని దర్శించుకుంటారు. భైంసా మండలం కామోల్ గ్రామానికి చెందిన భక్తులు ఐదేళ్లుగా పాదయాత్రగా బాసరకు వస్తున్నారు. ఈసారి కూడా పాదయాత్ర ప్రారంభించారు. కాగా, దసరా ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులు ఉపవాస దీక్షలో ఉండి ప్రతిరోజూ అమ్మవారిని దర్శించుకుంటామని ఆ గ్రామానికి చెందిన గంగారెడ్డి తెలిపారు. ఐదేళ్లుగా భక్తులమంతా కలిసి పాదయాత్రగా బాసరకు చేరుకుంటున్నట్లు చెప్పారు.

అక్రమ మద్యాన్ని కట్టడి చేయాలి


అధికారులతో సమీక్షిస్తున్న నర్సింహారెడ్డి

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నర్సింహారెడ్డి
- అంతర్రాష్ట్ర అబ్కారీ అధికారులతో సమీక్ష

ఆదిలాబాద్‌టౌన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యాన్ని పూర్తిస్థాయిలో కట్టడి చేయాలని ఎక్సైజ్‌శాఖ డెప్యూటీ కమిషనర్ నర్సింహారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీటీడీసీ సమావేశ మందిరంలో మహారాష్ట్ర, ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర అధికారులతో సమన్వయంగా వ్యవహరిస్తూ అక్కడి నుంచి ఉమ్మడి జిల్లా పరిధిలోకి మద్యం రాకుండా చూడాలని ఆదేశించారు. ప్రత్యేక తనిఖీ బృందాలతో నిరంతర నిఘా ఉంచాలన్నారు. సమాచారం అందిన వెంటనే అధికారులకు చేరవేయాలన్నారు. పాత నేరస్థులను బైండోవర్ చేసి వారిపై నిఘా పెట్టాలన్నారు. కొత్తగా చెక్‌పోస్ట్ పాయింట్లను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో మహారాష్ట్రలోని చంద్రాపూర్, అమరావతి, యావత్‌మాల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు నితీష్ షిండే, పాటిల్ సంజయ్, షేర్ సాగర్, పాండ్రకవడ, రాజురా సీఐలు జయంత్, తండ్యే, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల ఎక్సైజ్ సూపరింటెండెంట్లు హిమశ్రీ, శ్రీనివాస్‌రెడ్డి, నందగోపాల్, జ్యోతి కిరణ్, ఆదిలాబాద్ సీఐ శ్రీనివాస్, అధికారులు సమ్మయ్య, మోయిన్ అలీ, రాజేశ్‌కుమార్, మిలేష్, తదితరులు పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

- పోలీసుల అదుపులో 42 మంది
- రూ.2.51 లక్షలు, 12, కార్లు, 43 సెల్‌ఫోన్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న కార్లు


స్వాధీనం చేసుకున్న నగదు

చెన్నూర్: చెన్నూర్ సమీపంలోని గోదావరి నది ఒడ్డున గురువారం తెల్లవారుజాము పేకాటస్థావరంపై పోలీసులు దాడి చేశారు. పక్కా సమాచారంతోనే దాడి చేసి 42 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2.51 లక్షల నగదు, 43 సెల్‌ఫోన్లు, 12 కార్లు, 2 చార్జింగ్ లైట్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ వాసుదేవరావు తెలిపారు. వీరంతా గోదావరిఖని, ఎన్టీపీసీ, రామగుండం, బెల్లంపల్లి, మందమర్రి, కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాలకు చెందిన వారని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

పేకాట స్థావరాలు మార్చుకుంటూ..

వివిధ ప్రాంతాల్లో కొందరు రాత్రివేళ పేకాట ఆడుతున్నారు. పోలీసు నిఘా ఉన్న ప్రాంతాలను గమనించి పేకాట స్థావరాలను మార్చుకుంటున్నారు. గతేడాది మహారాష్ట్రలో పేకాట ఆడి తిరుగుప్రయాణంలో కోటపల్లి మండలం రాపన్‌పల్లి మీదుగా వస్తున్న మూడు కార్లను పోలీసులు పట్టుకున్నారు. తెలంగాణలోని జిల్లాల్లోనే కాకుండా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు వెళ్లి పేకాట ఆడుతున్నారని సమాచారం.